క్లుప్తంగా

చదువుతోనే అభివృద్ధి



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: ప్రతి విద్యార్థి ఉన్నత చదువే లక్ష్యంగా శ్రమించాలని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు చిత్తశుద్ధితో శ్రమించాలన్నారు. మనం ఎంచుకున్న లక్ష్యం ఉత్తమం అయితే గమ్యానికి సులువుగా చేరుకోగలమన్నారు. విద్యార్థులు బోధకులు చెబుతున్న పలు అంశాలను చక్కగా నేర్చుకోవాలని సూచించారు. జిల్లా ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అనేక పుస్తక సంపద ఉందని,దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



ఆలయాల వద్ద భిక్షాటన చేసుకున్న వారికి దుస్తులు పంపిణీ చేస్తున్న చెల్లూరి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు కూడళ్లు, పుట్‌పాత్‌లు, ఆలయాల వద్ద భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు శనివారం దుస్తులు పంపిణీ చేశారు.మల్కాపురం, శ్రీహరిపురంలోని ఆలయాల వద్ద ఉన్న సుమారు 30 మంది వృద్ధులకు ఆయన దుస్తులను,పండ్లు పంపిణీ చేశారు.

యారాడ బీచ్‌లో క్లీన్ డ్రైవ్



బీచ్‌లో సేకరించిన వ్యర్థాలను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన నేవీ సిబ్బంది

సింధియా: స్వచ్ఛమైన నీటి వనరులే లక్ష్యంగా ప్రారంభమైన పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం యారాడ బీచ్ క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. ఇండియన్ కోస్ట్ షిప్ సముద్ర పెహ్రేదార్ అధికారులు, నావికులు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 150 మంది ఈ బీచ్ క్లీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సముద్రతీర ప్రాంతాలను ప్రభావితం చేసే ప్రమాదకరమైన కాలుష్య కారకాలను నియంత్రించడమే లక్ష్యంగా ఐసీజీ సిబ్బంది నిర్వహించిన కార్యక్రమంలో బీచ్‌ను సందర్శించడానికి పర్యాటకులు సైతం చురుగ్గా పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు.

ఘంటసాలపై నాటక ప్రదర్శన నేడు

మద్దిలపాలెం: ఘంటసాల జీవిత చరిత్ర ఇతివృత్తంతో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి నాటకాన్ని ప్రదర్శించనున్నామని రంగసాయి వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి తెలిపారు. దేశంలో తొలిసారిగా రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీసాయి సంతోషి నాట్యమండలి సురభి వారిచే భాస్కరుని సత్య జగదీష్ రచన, దర్శకత్వంలో నాటకం ప్రదర్శించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు తొలి ప్రదర్శన, రాత్రి 7.30 గంటలకు రెండో ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర ప్రముఖులు పాల్గొనున్నారని తెలిపారు. ఇదే వేదికపై చిన్నారులతో లవకుశ పాటల ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు. టిక్కెట్లు కొనుగోలు చేసుకున్నవారు, వారికి నిర్దేశించిన సమయం ప్రకారం ప్రదర్శనలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 94404 58458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చెట్ల నీడే షెల్టర్!

- ముఖ్య కూడళ్లలో కానరాని బస్‌షెల్టర్లు
- తీవ్ర ఉష్ణోగ్రతలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



ఆర్‌కే పురం బస్టాప్ వద్ద చెట్టునీడలో ప్రయాణికులు



జింక్ ఆంజనేయస్వామి బస్టాప్ వద్ద కానరాని షెల్టర్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు నిలువ నీడ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా.. వానైనా ఆరు బయటే నిరీక్షిస్తున్నారు. ఎండ వేడికి తట్టుకోలేక స్టాప్‌కు దూరంగా ఉండే చెట్లనీడనే షెల్టర్లుగా మార్చుకుంటున్నారు. ఈ సమస్య పారిశ్రామిక ప్రాంతంలోని పలు ముఖ్యమైన కూడళ్లలో ఉంది. మల్కాపురం, శ్రీహరిపురం, ఆర్‌కేపురం, గాజువాక ఆర్టీసీడిపో, జింక్ ఆంజనేయస్వామి ఆలయం తదితర సెంటర్లలో షెల్టరు లేవు. ఆయా ప్రధాన సెంటర్ల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆయా సెంటర్ వద్దకు ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడం, వారు వేచి ఉండేందుకు షెల్టర్లు లేకపోవడంతో తీవ్ర ఎండలకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు సొమ్మసిల్లుతున్నారు. ఎక్కువ సేపు ఎండలో ఉండలేక ప్రయాణికులు స్టాప్‌కు దూరంగా ఉండే చెట్లనీడను, దగ్గరలో ఉండే వాణిజ్య సముదాయాల వద్ద బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

వినతులు ఇచ్చినా..

ప్రధాన సెంటర్లలో వసతులతో కూడిన షెల్టర్లు ఏర్పాటు చేయాలని గాజువాక ఆర్టీసీ డిపో యాజమాన్యానికి స్థానికులు వినతులు ఇచ్చారు.అయినా నేటికీ ఆ సమస్యకు పరిష్కారం లభించలేదు. ఇప్పటికైనా అధికారులు సమస్యపై స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



ప్రధాన సెంటర్లలో బస్సు షెల్టర్‌లు ప్రయాణికుల కోసం ఏర్పాటు చేయపోవడం దారుణం. ఆర్‌కే పురం బస్టాప్ వద్ద కనీస నీడ లేకపోవడంతో సెల్టర్‌కు దూరంగా చెట్టునీడన ఉండాల్సిన పరిస్థితి వస్తుంది. ఎండైనా.. వానైనా తిప్పలు తప్పడం లేదు.

– ఆడారి హరీష్, ప్రయాణికుడు

సొమ్మసిల్లుతున్నారు



మల్కాపురం బస్టాప్ వద్ద షెల్టర్ లేకపోవడంతో 58 ఏళ్ల వృద్ధుడు శనివారం మధ్యాహ్నం సొమ్మసిల్లి పడిపోయాడు. ఆ వృద్ధుడికి నాతో పాటు కొంత మంది సపర్యలు చేసి వేరే వాహనం సాయంతో ఇంటికి పంపించాం. అదే షెల్టర్ వద్ద నీడ ఉంటే ఆ పరిస్థితి వచ్చేది కాదు. అధికారులు స్పందించి షెల్టర్లు నిర్మించాలి.

– బాలు, స్థానికుడు

ఉన్నతాధికారుల దృష్టికి..

గాజువాక ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రలు ప్రధాన కూడళ్లలో బస్సు షెల్టర్ల ఏర్పాటు గురించి మా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారు స్పందించి జీవీఎంసీ ఉన్నతాధికారులకు షెల్టర్ ఏర్పాటు కోసం లేఖ రాశారు. జీవీఎంసీ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే షెల్టర్ నిర్మాణాలు చేపడతాం.

– ప్రవీణ, గాజువాక ఆర్టీసీ డిపో మేనేజర్

బంటాకాలనీ అభివృద్ధికి కృషి



స్థానిక సమస్యలపై నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

గోపాలపట్నం: బంటాకాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హామీ ఇచ్చారు. జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో శనివారం ఎమ్మెల్యే అదీప్‌రాజు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పర్యటించారు. పలు వీధుల్లో తిరుగుతూ స్థానికులతో మాట్లాడి సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. ఇందుకోసం రాజ్య సభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి మంజూరు చేసిన నిధులతో కాలనీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. నిధుల మంజూరుకు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కూడా అంగీకరించారని చెప్పారు. త్వరలో ఎంపీలను ఇక్కడికి తీసుకు వచ్చి క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితులు వివరిస్తామన్నారు. బంటా కాలనీ కాలనీ వాసులంతా ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు అండగా నిలవాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కోరారు. కార్యక్రమంలో నాయకులు అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీ కృష్ణ, యతిరాజుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల నాణ్యత పరిశీలన



చంద్రపాలెం స్టాక్ పాయింట్‌లో బూట్లు పరిశీలిస్తున్న పైడిరాజు

విశాఖ విద్య: జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యత ను శనివారం ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. 2023–24 విద్యా సంవత్సరం బడి తెరిచిన రోజునే విద్యార్థులందరికీ కిట్లు అందించేలా ఇప్పటికే పూర్తి స్థాయిలో వస్తువులన్నీ జిల్లాకు సరఫరా అయ్యాయి. వాటిని ఎంపిక చేసిన స్టాక్ పాయింట్లలో నిల్వ చేశారు. విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లలో నాణ్యతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన వస్తువుల నాణ్యత తనిఖీల కోసమని డీఈవో లక్ష్మణరావు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎంఈవోల నేతృత్వంలో ఆయా మండలాల్లోని ముగ్గురు సీనియర్ హెచ్‌ఎంలను సభ్యులుగా ప్రత్యేక టీమ్‌లను నియమించారు. వీరంతా స్టాక్ పాయింట్లను సందర్శించి, కిట్లను సమగ్ర పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు స్టాక్ పాయింట్లను తనిఖీ చేశాయి. చైల్డ్ ఇన్ఫో గణాంకాల మేరకు స్టాక్ పాయింట్లకు వచ్చిన వస్తువులు, నిల్వ ఉన్న వస్తువులు, వాటి నాణ్యత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ నివేదిక డీఈవోకు అందజేస్తామని చినగదిలి మండల తనిఖీ బృందంలోని సభ్యులు, సీనియర్ హెచ్‌ఎం ఇమంది పైడిరాజు తెలిపారు.

ప్రజల్లోకి అంబేడ్కర్ ఆశయాలు



కేక్ కట్ చేసి నినాదాలు చేస్తున్న అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు

సింధియా: జాతి గర్వించే విధంగా అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందని అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. జీవీఎంసీ 62వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి 8 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జై భీమ్ అంటూ నినాదాలు చేశారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ అంబేడ్కర్ దార్శనికతతోనే సకల జనులకు ఆర్థిక, సామాజిక న్యాయం అమలుల్లోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో గుడాల బాబూరావు, బడుగు సుబ్బారావు, ఉల్లి రమణ, ఈశ్వరరావు, సాయిచంద్, బర్రి ప్రసాద్, ములక అజయ్, పెయ్యల సిద్ధార్థ, శ్రీను, బొర్రా వేణుగోపాలరావు, లంబ సంజయ్, మెట్ట హేమంత్, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు



పనుల గురించి ఆరా తీస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడొద్దని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ 52వ వార్డు కరాసాలో పార్కులో జరుగుతున్న గ్రీనరీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. శాంతినగర్, కరాసాతో పాటు 13 పార్కుల్లో పనులు జరుగుతున్న పనులను ఆయన సమీక్షించారు. స్థానిక ప్రజలు పార్కుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. వీలైనంత తొందరగా సుందరీకరణ పనులు పూర్తి చేయాలని సూచించారు.

పర్యావరణంపై అవగాహన అవసరం



జూలో ఆంగ్ల పదం లైఫ్ ఆకారంలో విద్యార్థులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొద్ది రోజులుగా లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యార్థులు, సందర్శకులకు పర్యావరణంపై జూ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వారిచే ఆంగ్ల పదం లైఫ్ ఆకారంలో నిలబెట్టి ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కలుగుతోందన్నారు. ఇందులో భాగంగా జూలో చిరుధాన్యాల వినియోగంపై అవగాహన, సీతాకోకచిలుకల సంరక్షణ తదితర వాటి గురించి విద్యార్థులకు, సందర్శకులకు ఆమె వివరించారు.

సీతారామరాజు పార్కును సందర్శించిన జీవీఎల్



సీతారామరాజునగర్ పార్క్‌లో స్థానికులతో మాట్లాడుతున్న జీవీఎల్

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజునగర్‌లో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు శనివారం వాక్ అండ్ టాక్ విత్ జీవీఎల్ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి పార్క్‌లో నడుస్తూ స్థానికులతో మాట్లాడారు. సీతారామరాజునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు పార్కులోని సమస్యలపై వినతి పత్రం అందించారు. బీజేపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు, సీనియర్ నాయకుడు జీసీ నాయుడు, స్వామి నాయుడు, వలిరెడ్డి శ్రీనివాసరావు, మంజుల, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యతను పాటించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా పరిష్కస్తున్నామన్నారు. కొండవాలు ప్రాంత ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధ చేస్తున్నామన్నారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆ పనులు ప్రాంభమయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉక్కు' సంకల్పంతో కార్మికుల విజయం తథ్యం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు ఉక్కు సంకల్పంతో కార్మికులు చేస్తున్న ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ పోరాటంలో కార్మికుల విజయం తథ్యమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 835వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్, చిత్రంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాదరాజు

మహారాణిపేట: రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై రైతులకు సరఫరా చేయాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీఏ ప్రసాద్ రాజు అధ్యక్షతన జేసీ విశ్వనాథన్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖ, సూక్ష్మ సేద్యం, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఖరీఫ్ 2023 సీజన్‌లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా తగిన స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖ జేడీ కె.మన్మథరావు, పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, పీడీ ఏపీఎంఐపీ, డీఎం మార్క్ ఫెడ్, ఏపీ సీడ్స్ అభివృద్ధి అధికారి సాయినాథ్, ఏడీ మార్కెటింగ్ యాసిన్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం , కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం అట్టహాసంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మన చేతల్లోనే సంతోషం



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: సంతోషం మనిషి చేతల్లోనే ఉంటుందని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సైకాలజీ విభాగంలో 'హ్యూమన్ హ్యాపీనెస్(కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ)' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమస్య ఉత్పన్నమైనపుడు చికిత్స చేయడం కంటే.. అది ఎదురవకుండా చూడటం ప్రధానమన్నారు. ఈ దిశగా పాఠశాల స్థాయి నుంచి చిన్నారులను సిద్ధం చేయాలన్నారు. మానసిక నిపుణులు దీనికి అనవరమైన శిక్షణ అధ్యాపకులు అందించాలని సూచించారు. తద్వారా మంచి పౌరులను తీర్చిదిద్దడం, మానవ ఆనందం, ఆరోగ్యం సంరక్షించడం సాధ్యపడుతుందన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ ఒత్తిడి కారణంగా రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు పెరిగిపోతున్నాయన్నారు. మంచి మానవ సంబంధాలను కలిగి ఉండటం ఎంతో ప్రధానమన్నారు. కొన్ని రకాల రోగాలకు వైద్యంతోపాటు కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానసిక సమస్యలను దూరం చేయడానికి యోగా ఒక సాధనంగా పని చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం మానసిక సమస్యలు పెరగడం ఆందోళన కలిగించే అంశగా మారుతోందన్నారు. సదస్సులో నిపుణులు అందించే ప్రసంగాలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల విభాగాధిపతి డాక్టర్ సి.రాధాకాంత్ మాట్లాడుతూ నేడు టెలీ సైక్రియార్టీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆలోచనలు, మనస్సు, ప్రవర్తన సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి తదితరులు ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

విద్యా కానుక కిట్ల నాణ్యత పరిశీలన

విశాఖ విద్య: జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతను శనివారం ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. 2023–24 విద్యా సంవత్సరం బడి తెరిచిన రోజునే విద్యార్థులందరికీ కిట్లు అందించేలా ఇప్పటికే పూర్తి స్థాయిలో వస్తువులన్నీ జిల్లాకు సరఫరా అయ్యాయి. వాటిని ఎంపిక చేసిన స్టాక్ పాయింట్లలో నిల్వ చేశారు. విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లలో నాణ్యతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన వస్తువుల నాణ్యత తనిఖీల కోసమని డీఈవో లక్ష్మణరావు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎంఈవోల నేతృత్వంలో ఆయా మండలాల్లోని ముగ్గురు సీనియర్ హెచ్ఎంలను సభ్యులుగా ప్రత్యేక టీమ్‌లను నియమించారు. వీరంతా స్టాక్ పాయింట్లను సందర్శించి, కిట్లను సమగ్ర పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు స్టాక్ పాయింట్లను తనిఖీ చేశాయి. చైల్డ్ ఇన్ఫో గణాంకాల మేరకు స్టాక్ పాయింట్లకు వచ్చిన వస్తువులు, వాటి నాణ్యత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ నివేదిక డీఈవోకు అందజేస్తామని చినగదిలి మండల తనిఖీ బృందంలోని సభ్యులు, సీనియర్ హెచ్ఎం ఇమంది పైడిరాజు తెలిపారు.

'కంటి వెలుగు' విజయవంతం చేయాలి

మహారాణిపేట: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. అప్పుఘర్ వద్ద ఫిషర్‌మెన్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో మాట్లాడారు. అవ్వాతాతలకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం గురించి అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కునగరం క్లబ్ పాలకవర్గం ఎన్నిక



రవిరంజన్‌కు పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి రావు

ఉక్కునగరం: ఉక్కు అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం ఉక్కునగరం క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ప్రస్తుత పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం డీజీఎం జె.వి.రావు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. నామినేషన్ల ఘట్టం ముగిసేసరికి కమిటీ సంయుక్త కార్యదర్శిగా డి.రమేష్ (ట్రాఫిక్), కోశాధికారిగా ఎస్. తాతారావు (సీఆర్‌జీ), గ్రూప్–1 కార్యవర్గ సభ్యులుగా పి.వి.ఆర్. కిషోర్, డి.మురళీ మోహన్, అభిజిత్ కుమార్, మహేంద్ర సింగ్ రావత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిని, గ్రూప్–2 నుంచి ముగ్గురు సభ్యుల ఎన్నికకు సంబంధించి, ఎన్నికలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 8.30 వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 1685 ఓట్లకు గాను, 865 ఓట్లు పోల్ అయ్యాయి. రాత్రి 9గంటలు దాటిన తర్వాత కౌంటింగ్ ప్రారంభించారు. కార్యదర్శిగా ఆర్.ఎం.హెచ్.పి ఏజీఎం రవిరంజన్ 374 ఓట్లు సాధించి, తమ సమీప అభ్యర్థి కె.ఎస్. రామాంజనేయులుపై 36 ఓట్ల తేడాతో గెలుపొందారు. అనంతరం విజేతలకు రిటర్నింగ్ అధికారి జె.వి.రావు అధికారిక ధ్రువీకరణ పత్రం అందజేశారు.